క్లుప్తంగా

బాధితుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



లబ్ధిదారునికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ సిటీ: విద్యుత్ షాక్‌తో ఎడమ చేతిని కోల్పోయిన పట్టణానికి చెందిన పినపోతు ప్రసన్న దీపక్‌పాల్‌కు రూ.5 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి బుధవారం అందజేశారు. తనకు ఆర్థిక సాయం చేయాలని బాధితుడు కోరడంతో ఎమ్మెల్యే సహకారంతో ఈ సాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ఆపద సమయంలో ఉన్న పేద వర్గాలను ఆదుకోవడంతో సీఎం జగన్ ముందుంటారన్నారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మాజీ కౌన్సిలర్ సంగాని నందం పాల్గొన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి



మొల్లమాంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ, ఎఫ్‌ఏసీ కమాండంట్ సతీష్‌కుమార్

కాకినాడరూరల్: మూడవ బెటాలియన్ ఏపీఎస్పీలో కవయిత్రి అతుకులూరి మొల్లమాంబ జయంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ, ఎఫ్‌ఏసీ కమాండంట్ ఎస్.సతీష్‌కుమార్ హాజరై మొల్లమాంబకు నివాళులర్పించారు. అడిషనల్ కమాండెంట్ ఈఎస్.సాయి ప్రసాద్, అడిషనల్ ఎస్పీ ఎల్.అర్జున్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక బోట్‌క్లబ్ ఆవరణలో మొల్ల విగ్రహానికి డీఆర్వో డి.తిప్పే నాయక్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారి ఎస్.రాజేశ్వరి, ఇతర సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్, ఎమ్మెల్యే కన్నబాబును ఆశీర్వదించండి



కూడికలో పాల్గొన్న సర్పంచ్ రామదేవు

కాకినాడ రూరల్: రానున్న ఎన్నికల్లో మరోసారి విజయం సాధించేలా సీఎం జగన్, ఎమ్మెల్యే కన్నబాబుతో పాటు ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను ఆశీర్వదించాలని నేమాం సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు పాస్టర్లను అభ్యర్థించారు. నేమాం సీయోను ప్రార్థన మందిరంలో బుధవారం పి.వెంకటాపురం, తమ్మవరం, పెనుమర్తి, కొత్తూరు గ్రామాల దైవజనుల సహవాస కూడికను వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు దడాల జాషువా గిరి అధ్యక్షతన నిర్వహించారు. పాస్టర్లు రాజేష్‌బాబు, జార్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

ధూమపానంతో దుష్ప్రభావాలు



ధూమపానం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అడ్డాల సత్యనారాయణ

బోట్‌క్లబ్: ధూమపానంతో మనిషిలో విధ్వంసక ప్రభావాలు వస్తాయని ఇండియన్ డెంటల్ అసోసియేషన మాజీ అధ్యక్షులు అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక ఏపీఐఐసీ కాలనీలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, నాగేంద్ర, చైతన్య, సిరాజ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కరప: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు నడకుదురు గ్రామానికి చెందిన సింగంపల్లి పెదవెంకట్రావు (75) ఈనెల 11న టీటైమ్ షాపువద్ద రోడ్డు దాటుతుండగా స్కూటర్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అతని కుమారుడు అప్పన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

వాకింగ్‌కి వెళ్లిన ఒకవ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయపడ్డాడు. ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపిన కథనం మేరకు తూరంగి గ్రామానికి చెందిన దడాల అప్పారావు మంగళవారం రాత్రి కరప మండలం నడకుదురువైపు వాకింగ్‌కి వచ్చి తిరిగి వెళుతుండగా ఫంక్షన్‌హాలు సమీపంలో వాహనం ఢీకొని గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అప్పారావును చికిత్సకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగన్‌పై నమ్మకంతోనే పార్టీలో చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన యువకులతో చలమలశెట్టి సునీల్, కురసాల సత్యనారాయణ తదితరులు

- ఎమ్మెల్యే కన్నబాబు, పార్లమెంటరీ కో ఆర్డినేటర్ సునీల్
- సర్పవరం నుంచి వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



పార్టీలో చేరిన కాల్వగట్టు వారితో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతో పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరికలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, కాకినాడ పార్లమెంటరీ కో ఆర్డినేటరు చలమలశెట్టి సునీల్ పేర్కొన్నారు. మండలంలోని సర్పవరం గ్రామం భావనారాయణపురం నుంచి గ్రామ నాయకులు పుల్ల కోటేశ్వరరావు, బత్తిన పైడిరాజు ఆధ్వర్యంలో యువకులు టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో బుధవారం చేరారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీలో చేరిన గోపి, లక్ష్మణ్, డీజే, దుర్గా ప్రసాద్ వారికి పార్టీ కండువాలను సునీల్, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కన్నబాబు, సునీల్ మాట్లాడుతూ జగనన్న సంక్షేమ రాజ్యం స్థాపన కోసం మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అకాశం ఇవ్వాలన్నారు. తమకు ఆశీస్సులు ఇవ్వాలని కోరారు.

కాల్వగట్టు నుంచి చేరికలు..

మండలంలోని రమణయ్యపేట కాల్వ గట్టుకు చెందిన పలువురు టీడీపీ, జనసేన కార్యకర్తలు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. రమణయ్యపేట కాల్వగట్టుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నేరెడుమిల్లి రత్నంరాజు ఆధ్వర్యంలో గుడ్ల డేవిడ్‌రాజు, సరోజిని, రాంబాబు, సంతోష్ కుమార్, సూర్యనారాయణ తదితరులు సుమారు 50 మంది చేరడంతో వారికి పార్టీ కండువాలు వేసిన కన్నబాబు సాదరంగా ఆహ్వానించారు.

రిజిస్ట్రేషన్ పట్టాలకు ఈ-కేవైసీ తీసుకోవాలి



కరపలో గ్రామ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ

కరప: ఇళ్ల స్థలాల పట్టాలకు రిజిస్ట్రేషన్ చేసిన లబ్ధిదారులను కలసి వారినుంచి ఈ-కేవైసీ తీసుకోవాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన గ్రామ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశమై ఈ విషయాలపై అవగాహన కల్పించారు. మండల పరిధిలో ఇళ్ల స్థలాలిచ్చిన పట్టాలన్నింటికీ రిజిస్ట్రేషన్ చేసి, దస్తావేజులు ఇవ్వడం జరిగిందని, వారి నుంచి ఈకేవైసీ తీసుకోవాలన్నారు. రెండు మూడురోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానుందని తెలిపి, ఎన్నికల కోడ్ అమలులో అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో వివిధ రాజకీయపార్టీల నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తించి, వారి చిరునామాలు నమోదు చేయాలన్నారు. కోడ్ అమలులోకి రాగానే వాటిని తొలగించాలన్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడిలేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈఓపీఆర్డీ బీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏపీఎస్పీలో ఉచిత వైద్య శిబిరం

- ప్రారంభించిన ఎస్పీఎఫ్ డీజీ త్రివిక్రమ్ వర్మ



సిబ్బందికి గుండె పరీక్షలు చేస్తున్న వైద్యులు

కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏపీఎస్పీఎఫ్) సిబ్బందికి రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్ క్యాంపస్‌లో కాకినాడ ట్రస్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరాన్ని ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ త్రివిక్రమ్ వర్మ వర్చువల్‌గా ప్రారంభించారు. ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బసవా శ్రీనివాసరావు, ట్రస్ట్ ఆస్పత్రి ఎండీ డాక్టరు వై.కల్యాణ్ చక్రవర్తి, డైరెక్టర్ డాక్టరు రామకృష్ణ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో ఎస్పీఎఫ్ సిబ్బంది సుమారు 200 మందికి గుండె, ఇతర వ్యాధులకు పరీక్షలు చేసి అవసరమైన సూచనలు ఇచ్చారు. త్రివిక్రమ్ వర్మ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ నిరంతరం భద్రతా విధుల్లో ఉండే తమ సిబ్బందికి ట్రస్ట్ ఆస్పత్రి ద్వారా వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏస్పీఎఫ్ డీజీ డాక్టరు త్రివిక్రమ్ వర్మ, ఐజీ రామిరెడ్డి మార్గదర్శకంలో ట్రస్ట్ ఆస్పత్రి ద్వారా వైద్య శిబిరం ఏర్పాటు చేయించామని ఇందుకు ఆస్పత్రి యాజమన్యం, వైద్యులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. శిబిరంలో సీనియర్ జనరల్ ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్ డాక్టరు ఫణిరమణ, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సనా ప్రవీణ్, నేత్ర వైద్య నిపుణులు డాక్టరు లక్ష్మి, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నిశాంత్, కార్డియాలజిస్ట్ డాక్టరు సురేష్ తదితరులు వైద్య సేవలందించారు.

లేబర్ బడ్జెట్ సత్వరం పూర్తిచేయాలి



కరపలో ఉపాధి పనులపై సమీక్షిస్తున్న ఏపీఓ వెంకటరమణ

కరప: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో పక్షం రోజుల్లో ముగియనున్నదని, ఈ ఏడాదిలో చేయాల్సిన లేబర్‌బడ్జెట్ నూరుశాతం పూర్తిచేయాలని ఉపాధి హామీ పథకం ఏపీఓ ఇ.వెంకటరమణ సూచించారు. స్థానిక మండలపరిషత్ సమావేశమందిరంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, సిబ్బందితో ఆయన సమావేశమై మార్చి నెలాఖరుకు పూర్తిచేయాల్సిన పనిదినాలపై, వచ్చే ఏడాది చేపట్టే పనులపై సమీక్షించారు. ఉపాధికూలీలకు మార్చి నెలాఖరుకు 3,21,820 పనిదినాలు పనులు కల్పించాల్సి ఉండగా ఇంత వరకు 3,02,340 పనిదినాలు పూర్తిచేశారని, రెండు వారాల్లో నూరుశాతం పూర్తిచేయాలన్నారు. ఏప్రిల్ నెల నుంచి కొత్త పనులు ప్రారంభించాల్సి ఉందని, ఆయా పనులను గుర్తించి, ప్రతిపాదనలు పంపించాలని ఏపీఓ వెంకటరమణ సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్లు కేజే ప్రకాష్, టి.రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

‘కొండబాబూ’ కబ్జాదారులెవరు?

- అవగాహన లేకుండా టీడీపీ నేతలపైనే విమర్శ
- ద్వారంపూడిపై అవాకులు, చెవాకులు పేలొద్దు
- మండిపడ్డ వైఎస్సార్ సీపీ నేతలు, వర్తకులు



మాట్లాడుతున్న నాయకులు, వర్తకులు

కాకినాడ: టీడీఆర్ బాండ్లు తీసుకున్న ద్వారంపూడి అనుచరుడు అడ్డగోలుగా మెయిన్‌రోడ్డులో దుకాణాన్ని ఏర్పాటు చేశాడంటూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు చేసిన విమర్శలపై పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, జ్యోతుల మార్కెట్ వర్తకులు మండిపడ్డారు. టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఉన్న చెక్కా శ్రీనివాస్‌కు చెందిన ప్రైవేటు స్థలాన్ని చూపించి అది ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి అనుచరుడిదంటూ గొంతుచించుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సొంతపార్టీ నేతపైనే కబ్జాముద్ర వేసి హడావుడి చేసిన వనమాడి తీరు దొంగే దొంగ అన్నట్టు ఉందన్నారు. జ్యోతుల మార్కెట్ వద్ద పార్టీ నాయకులు అజ్జు, జ్యోతుల మార్కెట్ వర్తక సంఘ అధ్యక్షుడు మోయిన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ నగరాధ్యక్షుడు ఖాలీద్‌బిన్ వలీ, ఇతర వ్యాపారులు వనమాడి విమర్శలపై ఘాటుగా స్పందించారు. ఒకప్పుడు జ్యోతుల మార్కెట్ దుర్భర స్థితిలో రేకుల షెడ్లులలో ఉంటే ఎమ్మెల్యే ద్వారంపూడి చొరవ తీసుకుని దుకాణాలు నిర్మించి సౌకర్యవంతంగా తీర్చిదిద్దారని, అదే కొండబాబు అక్కడ ఉన్న రిక్షా స్టాండ్‌లను కూడా కబ్జా చేసిన చరిత్ర ఉందన్నారు. కబ్జాల ప్రభుత్వం మీదైతే- అభివృద్ధి ప్రభుత్వం తమదని, ద్వారంపూడిపై అవాకులు చవాకులు పేలొద్దని హితవు పలికారు. టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తులో తనకు టిక్కెట్ వస్తుందో? రాదో అన్న ఫ్రెస్టేషన్‌లో ఉన్న వనమాడి కొండబాబు మతిభ్రమించి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు.

హామీల అమలు ఆనందంగా ఉంది

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్ ప్రారంభం



శెట్టిబలిజ కమ్యూనిటీ హాలు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: గడప గడపకూ మన ప్రభుత్వంలో వచ్చిన వినతుల పరిష్కారం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక 38వ డివిజన్ ఎల్విన్‌పేటలో నిర్మించిన శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. సుదీర్ఘకాలంగా అసంపూర్తిగా నిలిచిపోయిన ఈ కమ్యూనిటీ హాల్‌ను రూ.8 లక్షలతో మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. ఐక్యతతో ఉండే శెట్టిబలిజపేట ప్రాంతవాసులు గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇక్కడ సందర్శించిన సందర్భంలో ఈ కమ్యూనిటీ హాల్ సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. తక్షణమే రూ.8 లక్షలు వెచ్చించి సకల సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తీసుకొచ్చామన్నారు. ఇదే ప్రాంతంలో రహదారులను కూడా అభివృద్ధి చేసి, అన్ని సమస్యలు పరిష్కరించామని ఆయన చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఒక్క హామీని అమలు చేసి పరిష్కరించినందుకు ఎంతో సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌ పసుపులేటి వెంకటలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జి చొదరి, ఈఈ మాధవి, డీఈ సుబ్బారావు, కొత్తపల్లి జెడ్పీటీసీ గుబ్బల తులసి కుమార్, ఏపీపీ పితాని శ్రీనివాసరావు, ఏజీపీ గెద్దాడ వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ నాయకుడు పిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడిని శెట్టిబలిజ కమ్యూనిటీ పెద్దలు ఘనంగా సత్కరించారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- రూ.1.8 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం



వాకలపూడిలో బొమ్మిడి చెరువు పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



గుడారిగుంటలో సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల

కాకినాడ రూరల్: గ్రామాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా నియోజకవర్గంలో సుమారు రూ.700 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను సీఎం జగన్ ఆశీస్సులతో చేపట్టినట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని వాకలపూడిలో బుధవారం రూ.1.8 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ప్రారంభోత్సవాలు చేశారు. రూ.50 కోట్లతో నిర్మించిన యాదవ కల్యాణ మండపం, రూ.35 లక్షలతో అభివృద్ధి చేసిన బొమ్మిడి చెరువు పార్కు, రూ.25 లక్షలతో నిర్మించిన చర్చిపేట రోడ్డు, రూ.70 లక్షలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఆయన ప్రారంభించారు. సిటీని ఆనుకుని ఉన్న వాకలపూడి, వలపపాకల గ్రామాల్లోని కల్యాణ మండపాలు, సామాజిక భవనాలు, రోడ్లు, డ్రైనేజీలు తదితర వాటిని కోట్లాది రూపాయలతో నిర్మించామన్నారు. యాదవ సామాజిక భవనంతో పాటు పక్కన వంటశాల, కృష్ణుడి గుడి చేపట్టామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు, మండల ఇంజినీరు వాసుదేవరావు, గొల్లపల్లి జగన్, వీధి విజయసారధి, మాజీ ఎంపీటీసీ ఇసకపట్ల లక్ష్మికుమారి తదితర నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సామాజిక న్యాయం

సామాజిక భవనాలతో అన్ని వర్గాలకు న్యాయం చేశామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. నియోజకవర్గంలో సుమారు 25 వరకు సామాజిక భవనాలు, ఫంక్షన్ హాళ్లను నిర్మించామన్నారు. కాకినాడ అర్బన్ 3వ డివిజన్ పరిధిలోని చిన్న శెట్టిబలిజపేటలో రూ.49 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలు, సంతనపురి కాలనీలో రూ.50 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలులను బుధవారం రాత్రి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటరు వడ్డి మణికుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు మాదబోయిన నేరేళ్ల పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ భవనం ప్రారంభం

కరప: మండలం వేళంగిలో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ సవిలే నీలిమ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు ఎక్కడికీ వెళ్లనక్కరలేకుండానే ప్రభుత్వసేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారాయన్నారు. ఎమ్మెల్యే కన్నబాబు గ్రామంలో సీసీరోడ్లు, డ్రెయిన్లు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు వంటి అనేక అభివృద్ధి పనులు చేయించారన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో గెలిపించి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. అందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా కురసాల కన్నబాబును, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కురసాల కోరారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ బొమ్మిడి వీర్రాఘవులు, ఎంపీటీసీ మునిని సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సవిలే రాజేష్, జీలకర్ర దుర్గారావు, సానా శ్రీను, కె.గుణేశ్వరరావు, కూళ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీనగర్ ఆదిత్యలో ఉత్సవ్ 2కే-24



విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు

బాలాజీచెరువు: శ్రీనగర్ ఆదిత్య పాఠశాల 40వ వార్షికోత్సవం సందర్భంగా ఉత్సవ్ 2కే-24 పేరుతో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మోటివేషనల్ స్పీకర్ మాకిన సతీష్, పూర్వ విద్యార్థి ప్రముఖ యురాలజిస్ట్ డాక్టర్ కార్తిక్ హరీన్ హాజరై విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు ముఖ్యమని విద్యాసంస్థలు ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. పూర్వవిద్యార్థి డాక్టర్ కార్తిక్ హరీన్ బాల్యంలో ఈ పాఠశాలలో నేర్పించిన క్రమశిక్షణ వల్ల ఈ స్థాయిలో ఉన్నానన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు10 మంది గైర్హాజరు

కొత్తపల్లి: స్థానిక వీవీఎస్ కళాశాలలో బుధవారం జరిగిన ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలకు 10 విద్యార్థులు గైర్హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ జి.సూర్యనారాయణ తెలిపారు. మొత్తం 193 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావల్సి ఉండగా 183 మంది విద్యార్థులు పరీక్షలు హాజరైనట్టు వివరించారు.

మౌలిక వసతుల కల్పనకు కోరమాండల్ నిధులు

- కలెక్టర్‌కు రూ. 56 లక్షల చెక్కు అందజేత



చెక్కును కలెక్టర్‌కు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

కాకినాడ సిటీ: కోరమాండల్ ఇంటర్నేషనల్ ఎరువుల కర్మాగారం యాజమాన్యం సీఎస్సార్ నిధుల నుంచి రూ.56 లక్షల చెక్కును బుధవారం కలెక్టర్ కృతికా శుక్లాకు అందించారు. ఈ నిధులను కాకినాడ రూరల్ మండలంలోని కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించనున్నట్లు కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. కోరమాండల్ పోషక ఎరువుల విభాగం ప్రెసిడెంట్ అమీర్ అల్వీ, కాకినాడ యూనిట్ హెడ్ శ్రీనివాసరావు, జీఎం హెచ్‌ఆర్ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం, స్ట్రాంగ్ రూమ్‌లకు పటిష్ట భద్రత

- ఆర్వో, కమిషనర్ వెంకటరావు ఆదేశం



స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి సూచనలిస్తున్న ఈఆర్వో, కమిషనర్ వెంకటరావు

కాకినాడ: ఎన్నికల సామగ్రిని భద్రపరిచే డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లకు పటిష్ట భద్రత కల్పించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కమిషనర్ జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన అధికారులతో కలిసి మెక్లారిన్ స్కూల్ ఆవరణలోని డిస్ట్రిబ్యూటరీ కేంద్రం, జేఎన్టీయూకేలోని స్ట్రాంగ్ రూమ్‌లను అధికారులతో కలిసి సందర్శించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఆయా కేంద్రాలలో పూర్తి భద్రత ఉందో లేదో పరిశీలించారు. చిన్నచిన్న సమస్యలు, సౌకర్యాలు కల్పించాల్సిన అవసరాలు ఉంటే తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్నికలకు ముందు ఈవీఎంలను తరలించే ప్రాంతం, ఎన్నికల తరువాత వాటిని భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో పర్యవేక్షించారు. ఆయన వెంట నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, ఏఈ రమేష్, తహసీల్దార్ దొర, డిప్యూటీ తహసీల్దార్లు సీతాపతిరావు, నాయుడు, పవన్, సర్వేయర్ ఆచార్యులు తదితరులు ఉన్నారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి

సామర్లకోట: విద్యార్థులు ఆరో తరగతి నుంచే ఆంగ్లం, హిందీ భాషలపై పట్టు సాధించేలా చూడాలని డీఈఓ పి.రమేష్ అన్నారు. బుధవారం స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేసి 9వ తరగతి విద్యార్థులతో ట్యాబ్‌ల వినియోగంపై సమీక్షించారు. ట్యాబ్‌లలో సాంకేతిక లోపాలను సవరించాలని హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణకు సూచించారు. పాఠశాల పీఎం ఎక్సలెన్స్ అవార్డు పోటీల్లో ఉన్న దృష్ట్యా అన్ని అంశాలపై మరింత శ్రద్ధ చూపాలన్నారు. 10వ తరగతిలో ప్రతీ విద్యార్థి గ్రేడ్-ఎ లక్ష్యంగా పాఠ్యాంశాలను శ్రద్ధగా చదివి సాధన చేయాలన్నారు. నాడు-నేడు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 పి. పుల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాల లబ్ధిదారులతో ప్రధాని ముఖాముఖి



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న డీఆర్వో తిప్పేనాయక్

కాకినాడ సిటీ: ప్రధాని మోదీ బుధవారం వర్చువల్ విధానంలో కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో ముఖాముఖి సంభాషించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి అధికారులు ఎస్సీ, ఏబీసీ, సఫాయి కర్మచారీ లబ్ధిదారులు పాల్గొన్నారు. లబ్ధిదారులకు రూ. లక్ష రుణం మంజూరుతో పాటు ఆయుష్మాన్ హెల్త్‌కార్డులు, పీపీఈ కిట్ల పంపిణీ నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పే నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జె.సత్యవతి, వై.వాణి తదితరులు పాల్గొన్నారు.